ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
గురువారం 18 జనవరి 2024



ఏలూరు కొత్త బస్టాండ్‌లో వీడ్కోలు



నరసాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



ఏలూరు కొత్త బస్టాండ్‌లో..

ఇక వెళ్లొస్తాం..!

- ఆనందోత్సాహాలతో ముగిసిన సంక్రాంతి
- భారంగా తిరుగుముఖం పట్టిన అతిథులు
- వీడ్కోలు పలికిన బంధుమిత్రులు
- బస్సులు, రైళ్లు కిటకిట.. ప్రత్యేక సర్వీసులు



ఏలూరు రైల్వే స్టేషన్‌లో..



కలపర్రు టోల్‌గేట్ వద్ద..

నరసాపురం/పెదపాడు, జనవరి 17 : సంక్రాంతి పండగకు వచ్చిన బంధుమిత్రులు, కొత్త అల్లుళ్లతో వారం రోజులుగా పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రతి ఇంటికి ఎవరో ఒకరు అతిథులుగా రావడంతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. జిల్లాలోని రహదారులన్నీ వాహనాల రాకపోకలతో కిక్కిరిశాయి. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు సందడిగా మారాయి. ఊరూరా జరిగిన అమ్మ వారి జాతర్లలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు కలిసి యోగక్షేమాలు తెలుసుకుని, నాటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు. గడిచిన 20 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా ఈసారి సంక్రాంతికి జిల్లాకు పెద్ద ఎత్తున తరలి రావడం విశేషం. కోడి పందేల నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారి సంఖ్య రెండు లక్షలు పైనే ఉంటే.. బంధుమిత్రుల సంఖ్య ఐదారు లక్షల పైమాటేనని అంచనా. వచ్చిన వారంతా తమకు తెలిసిన ప్రతి ఒక్కరిని పలకరించి యోగ క్షేమాలు తెలుసుకుని ఆప్యాయతలను కురిపించారు. ఇలా వారంపాటు ఎంతో సందడిగా కనిపించిన వాతావరణం బుధవారం ఒక్కసారిగా బోసిపోయింది. వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టడంతో ప్రతి ఇంటిలో వెళ్లిపోతున్నారనే బాధతో హృదయాలు బరువెక్కాయి. తమ బంధుమిత్రులను సాగనంపేందుకు బస్టాండులు, రైల్వే స్టేషన్ల వరకు వచ్చి బాధతో వీడ్కోలు పలికారు. ముక్కనుమతో సంక్రాంతి పండుగ ముగియడంతో అంతా ఒక్కసారిగా తిరుగుముఖం పట్టడంతో సాయంత్రం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు, భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకొల్లు, నరసాపురం, తణుకు ప్రాంతాల్లో రద్దీ కనిపించింది. బస్టాండ్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ 31 ప్రత్యేక బస్సులు నడిపింది. ఇక రెగ్యులర్ రైళ్లతోపాటు నరసాపురం నుంచి వేసిన రెండు ప్రత్యేక రైళ్లు నిండుకున్నాయి. టిక్కెట్లు దొరక్క చాలామంది ఇబ్బందులు పడ్డారు. విజయవాడ-విశాఖ వైపు వెళ్లే వాహనాలతో రోడ్లన్నీ నిండిపోయాయి. గతంలో మాదిరిగా రైల్వే శాఖ ఈ సారి ఎక్కువ స్పెషల్ సర్వీసులు నడపలేదు. నరసాపురం నుంచి మొక్కుబడిగా ఒక్క స్పెషల్ రైలు మాత్రమే నడిపింది. రెగ్యులర్ నడిచే లింగంపల్లి కాకుండా ఇది ఒక్కటే ప్రత్యేక రైలు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జనరల్ బోగీల్లో ఎక్కలేని పరిస్థితి. చాలామంది ముందుగా నరసాపు రం వచ్చి జనరల్‌లో ఎక్కారు. ఇక కాకినాడ నుంచి భీమవరం మీదుగా వెళ్లిన లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ నిండుకుంది. శేషాద్రి, సర్కార్, విశాఖ, ఎల్‌టీటీ వంటి ముఖ్య రైళ్ళల్లో వెయిటింగ్ లిస్టులు బారులు తీరాయి. ఈ రూట్లలో రైళ్లన్నీ ముందుగా నిండుకున్నాయి. ప్రత్యేక రైళ్లు వేయకపోవడంతో బెంగళూరు, చెన్నై, ముంబయి వెళ్లే ప్రయాణీకులు రైళ్లు మారాల్సి వచ్చింది.

లక్షల్లో కార్లు

పందేల కోసం ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలపై రావడంతో గతంలో ఎన్నడూ లేనన్ని కార్లను జిల్లాలో కనిపించాయి. టోల్ ప్లాజా నిర్వాహకుల అంచనా ప్రకారం ఈసారి హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వచ్చిన వాహనాల సంఖ్య లక్షల్లో ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. కలపర్రు, ఉంగుటూరు తదితర టోల్ ప్లాజాల వద్ద బుధవారం రద్దీ కనిపించింది. గతంలో టోల్‌గేట్ వద్ద టోల్‌ఫీజు చెల్లించేందుకు వాహనాలు బారులు తీరేవి. ఫాస్టాగ్ రావడంతో వాహనం టోల్‌గేట్ సమీపించిన క్షణాల వ్యవధిలో వెళ్లిపోతున్నాయి.

చికెన్ తక్కువ ధరకు అమ్ముతున్నాడంటూ దాడి

తీవ్ర గాయాలు.. చికిత్సకు విజయవాడ తరలింపు

ఉంగుటూరు, జనవరి 17 : 'కేజీ చికెన్ ధర రూ.265 వుంటే పాతిక రూపాయలు తగ్గించి రూ.240కు ఇస్తావా ? ఇలాగైతే మా వద్ద ఎవరు కొంటారు ? మేం వ్యాపారం చేసుకోవద్దా ?' అంటూ ఓ చికెన్ వ్యాపారి కుటుంబం, పక్క వ్యాపారిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరి చారు. ఈ ఘటన ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. కైకరానికి చెందిన కూతాడ దుర్గారావు ఏడాది నుంచి అక్కుపల్లిగోకవరంలో చికెన్ దుకాణం నడుపుతున్నాడు. అయితే ధర విషయంలో పక్క దుకాణదారు శ్రీను తో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ముక్కనుమను పురస్కరించుకుని మాకంటే తక్కువ ధరకు ఎందుకు అమ్ముతున్నాంటూ శ్రీనుతోపాటు అతని కుటుంబ సభ్యులు దుర్గారావుపై దాడి చేశారు. స్థానికులు వారిని విడదీశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నాలుగో రోజు

పందెం జోరు



కాలు దువ్విన కోళ్లు

- ముక్కనుమ నాడూ బరితెగించారు
- పెద్ద బరుల్లో చేతులు మారిన కోట్లు
- కొందరు ఖాకీలు, రెవెన్యూ సిబ్బందికి ముడుపులు.. బరుల వద్ద పలువురు వసూళ్లు
- లక్షల్లో పాగొట్టుకున్న సామాన్యులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి/భీమవరం/పాలకొల్లు/తాడేపల్లిగూడెం రూరల్/ పెదవేగి, జనవరి 17:ఎన్నికల సంవత్సరం కావడం.. అధి కార పార్టీ ఒత్తిడితో నాలుగో రోజు ముక్కనుమ నాడు కోడి పందేలను అనుమతించారు. ఏటా పండుగ మూడు రోజులతో పందేలు ముగించేవారు. భోగి రోజు మధ్యాహ్నం 12 గంటల కు అనుమతులు మంజూరుకావడంతో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పందేలు ప్రారంభమయ్యాయి. కనుమ రోజున అంటే మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నిలుపుదల చేయాలంటూ పోలీసులు స్పష్టం చేయడంతో పల్లెల్లో చిన్న బరులన్నీ మూతపడ్డాయి. కోడి పందేలు లేవన్న ఉద్దేశంతో చాలామంది మంగళవారం రాత్రే తిరుగుముఖం పట్టారు. అయితే పెద్ద బరులు మాత్రం ముక్కనమ రోజున నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో బుధవారం ఉదయం పది నుంచి పందేలు మొదలుపెట్టారు.

కాళ్ల మండలం సీసలి, పెదఅమిరంలో పెద్ద మొత్తంలో పందేలు కాశారు. కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఒక్కో పందెం లక్షల్లో కాశారు. ఆకివీడు, ఉండి, పాలకోడేరు మండలాల్లో యథావిధిగా బరులు కొనసాగాయి. యలమంచిలిలో మహిళలు గుండాటలో పాల్గొన్నారు. కలగంపూడిలో జోరుగా పందేలు సాగాయి. పోలీసులు మాత్రం పండుగ నాలుగు రోజులు మౌనం దాల్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పందేలవైపు చూడకుండా ఉండేందుకు ఈ నాలుగు రోజుల్లో ఖాకీలకు, రెవెన్యూ శాఖలోని వివిధ అధికారులకు కోట్లలో ముడుపులు అందించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కొందరు కింది స్థాయి ఉద్యోగులైతే నేరుగా బరుల వద్దకే వచ్చి మామూళ్లు దండుకున్నారు. అరికట్టాల్సిన వీరే ఇలా బరితెగిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బరులు రక్తసిక్తం

ప్రతీ బరిలోనూ వందల కొద్దీ పందెం కోళ్ల నెత్తురుతో తడిసి ముద్దయింది. ఒకపక్క తల, కాళ్లు, గుండె తెగిపడు తున్నా పుంజులు లెక్క చేయకుండా తమ యజమానిని గెలిపించేందుకు ప్రాణాలర్పించాయి. కొన్ని కోళ్లు పందెం గెలిచి వీర మరణం పొందితే, కొన్ని కోళ్లు పందెంలో పోరాడి ఇదిరా పుంజు రాజసం అని అనిపించుకున్నాయి. ఇలా వందలాది కోళ్ల నెత్తురుతో బరులు తడిసి ముద్దయ్యాయి.



పెదవేగి మండలం కొండలరావుపాలెం బరి వద్ద కోసాట

జేబులు ఖాళీ

సంక్రాంతికి వచ్చిన యువత కోడి పందేలతో పాటు జూదాలలో పాల్గొని పెద్ద మొత్తంలో సొమ్ములు పోగొట్టుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి పది శాతం జూదాల బరులు అధికంగా వేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యువత కోట్లలో పోగొట్టుకుని ఉసూరు మంటూ ఇంటి ముఖం పట్టారు. వీరిలో సాఫ్ట్‌వేర్ యువత ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. భీమవరం త్రీ టౌన్ ఏరియాలోని ఒక లాడ్జిలో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బుక్ చేసుకున్నారు. మెజారిటీ ఉద్యోగులు జేబులు ఖాళీ చేసుకుని తిరుగుముఖం పట్టారు. ఈసారి గుండాటలో ఆరు గుళ్లకు బదులు రెండు గుళ్లను వినియోగించారు. సొమ్ములు గెలిస్తే వారికి ఆరు రెట్లు ఇస్తామని చెప్పారు. దీంతో ఆడే వారికి నష్టమే వాటిల్లింది. కొందరు పోలీసులు, కొందరు మీడియా సిబ్బంది ఇబ్బడి ముబ్బడిగా నగదు దండుకున్నారని శిబిరాల నిర్వాహకులు చెప్పారు. కొందరు అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల గన్‌మేన్, పీఏలు కూడా పందేల బరి వద్దకు వచ్చి మమూళ్ళు చేసుకున్నారని చెబుతున్నారు.

- తాడేపల్లిగూడెం మండలం సింగవరంలో నెల్లూరు నుంచి పుంజులతో వచ్చిన పందెగాళ్లు మొదటిరోజు జోరు చూపించి భారీ మొత్తంలో గెలిచారు. వారికి రెండో రోజు నిరాశే మిగిలింది. తెచ్చిన సొమ్ముతోపాటు గెలిచిన సొమ్మును కూడా పోగొట్టుకున్నారు. ఈ రకంగా సుమారు రూ.2 కోట్లు పోగొట్టుకున్నట్టు సమాచారం. తాడేపల్లి గూడెంకు చెందిన ప్రముఖులు భారీగా పందేలు గెలిచారు.
- హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆనంద్ పండుగకు తమ స్వగ్రామం యలమంచిలి వచ్చాడు. కోడి పందేలు చూద్దామని స్నేహితులతో కలిసి వెళ్లి.. పందేలు, జూదంలో రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు.
- పోడూరుకు చెందిన రైతు కూలీ వెంకటేశ్వర్లు పండుగ పూట కొత్త దుస్తులు వేసుకుని, రైతు ఇచ్చిన బోనస్ డబ్బులు, దాచుకున్న సొమ్ములు రూ.20 వేలతో పందేలకు వెళ్లి గంటలో జేబులు ఖాళీ చేసుకున్నాడు. మిగిలిన రెండొందలతో పూటుగా చీఫ్ లిక్కర్ తాగి కాలువ గట్టున పడిపోయాడు.
- ఇలా వీరే కాదు.. వేలాది మంది కష్టపడి సంపాదించిన సొమ్మును కోడి పందాలు, గుండాట, పేకాటల్లో సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా గడపాల్సిన పండుగను ఇలా విషాదంగా మార్చుకున్నారు.
- పెదవేగి మండలం కొండలరావుపాలెంలో కోడిపందేలు నాలుగోరోజు బుధవారం కూడా జోరుగా సాగాయి. స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో అనధికార అనుమతితో బహిరంగంగా, యథేచ్ఛగా సాగాయి. ఉద యం నుంచి రాత్రి వరకు పందేలు జరుగుతూనే ఉన్నాయి. పందేల సమాచారం తెలిసినా పోలీసులు తెలియనట్లే మిన్నకుండి పోయారు. అధికార పార్టీ నేతలు కావడంతో పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పోలీస్ స్టేషన్ నుంచి బయటకు రాలేదు. పందేలుకు అనుబంధంగా కోసాట, గుండాట జోరుగా సాగాయి.



పెదవేగి మండలం కొండలరావుపాలెం బరి వద్ద గుండాట



వైరస్ సోకి చనిపోయిన రొయ్యలు

రొయ్యకు వైరస్

- సీడ్ దశలోనే వనామికి పెద్ద దెబ్బ
- ఆక్వా రైతుల్లో ఆందోళన

కలిదిండి, జనవరి 17 : వనామి రొయ్యల సాగు చేస్తున్న రైతులకు సీడ్ దశలో షాక్ తగులుతోంది. చెరువులో సీడ్ వేసిన నెలరోజులకే వైరస్ సోకి చనిపోతున్నాయి. రొయ్యలకు ధర పెరుగుతుండడంతో రైతులు రొయ్యల సాగు ప్రారంభించారు. సీడ్ దశలో వైరస్ సోకడంతో వంద కౌంటుకు రాకుండానే రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వైజాగ్, కాకినాడ, నెల్లూరు, చెన్నైతో పాటు స్థానికంగా హేచరీలు సుమారు 200 వరకు ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వం ఆధ్వర్యంలో సీడ్ ఉత్పత్తి పరిమితంగా సాగుతోంది. కొనుగోలు చేసిన సీడ్‌ను ల్యాబ్‌లలో పరీక్షించినప్పుడు ఎటువంటి వైరస్ తేలలేదని, కానీ చెరువులో వేసే సరికి చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మొన్నటి వరకు 25 పైసలు ఉన్న రొయ్య పిల్ల ధర అమాంతంగా హేచరీల్లో 35 పైసలకు పెంచారు. ఎకరానికి లక్ష నుంచి రెండు లక్షలు వరకు రొయ్య పిల్లలను వదులుతారు. పెరిగిన ధరతో సీడ్ కొనుగోలు చేసి చెరువులో వేసిన నెల రోజులకే వైరస్‌తో మృత్యువాత పడుతుం డడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ప్రైవేట్ హేచరీలపై ఆధారపడడం వల్లే వైరస్ సీడ్ కొనుగోలు చేసి నష్టపోతున్నామని, ప్రభుత్వమే హేచరీలు ఏర్పాటు చేసి నాణ్యమైన సీడ్‌ను ఉత్పత్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రొయ్య పిల్లలను వేసే ముందు చెరువు గుణగణాలను సమగ్రంగా పరిశీలించి తెలుసుకోవాలి. ఉదజని, వీహెచ్‌సీ పరీక్షించాలి. చెరువులో ఒక అడుగు నీరు నిండిన తర్వాత ప్లవకాలు వృద్ధి చెందేలా దృష్టి పెట్టాలి. సీడ్ సమయంలో మూడు అడుగుల నీరు ఉండాలి. ప్రధానంగా ఉదజని, అమ్మోనియా, నైట్రేట్ వంటి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

- చాన్ బాషా, మత్స్యశాఖ ఏడీ

నాసిరకం సీడ్‌తో నష్టాలు



ప్రైవేట్ హేచరీలు లాభార్జనే ధ్యేయంగా నాసిరకం సీడ్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. తూతూ మంత్రంగా పీసీఆర్ పరీక్షలు చేయడంతో చెరువులో వదిలిన నెల రోజుల్లోనే వనామి రొయ్యలు చనిపోతున్నాయి. లక్షలాది రూపాయల నష్టం వస్తోంది. ప్రభుత్వమే హేచరీలను ఏర్పాటు చేసి నాణ్యమైన రొయ్యల సీడ్‌ను ఉత్పత్తి చేయాలి.

- పి.శ్రీనివాస్, ఆక్వా రైతు

ప్రభుత్వ అజమాయిషీ లేకే..



హేచరీలపై ప్రభుత్వ అజమాయిషీ లేక సముద్ర తీర ప్రాంతా ల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లాభార్జనే ధ్యేయంగా నాసిరకం సీడ్‌ను విక్రయిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు హేచరీ కేంద్రాలను తరచూ తనిఖీలు చేసి నాణ్యమైన రొయ్యల సీడ్‌ను విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

- దుగ్గిరాల పరమేశ్వరరావు, ఆక్వా రైతు



ఇసుక బొక్కేస్తున్నారు!

- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్
- కోట్లు దండుకుంటున్న మాఫియా
- ప్రభుత్వ ఆదాయానికి గండి.. సీనరేజ్, పంచాయతీల వాటా నిల్..

పాలకొల్లు, జనవరి 17: నలుగురు నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు.. నాకేటి లజ్జ అన్న చందాన ఉమ్మడి పశ్చిమలో ఇసుకాసురులు నిస్సిగ్గుగా, నిర్భయంగా ఎడాపెడా ఇసుకను తవ్వేస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. నాలుగేళ్లుగా ఇసుక అమ్మకాలు ద్వారా సీనరేజ్ ఎంత సేకరించారో అధికారులకే తెలియాలి. ప్రభుత్వ పనులు లేవు. బిల్డర్‌లు నిర్మాణాల ఊసే ఎత్తడంలేదు. అయినప్పటికీ ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.అర కోటి ఇసుక దందా జరుగుతోంది. రాష్ట్రంలో పూర్తిస్థాయిలో పర్యావరణ అనుమతులు ఇచ్చిన అనంతరమే నదుల్లోనూ, నదీ పాయల్లోనూ, సెలయేర్లు వెంబడి ఇసుక సేకరణ చేయవద్దని నేరుగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ తాడేపల్లి పెద్దల కనుసన్నల్లో నిత్యం ఇసుకను దోచేస్తున్నారు. పర్యావరణ అనుమతులు ఉంటేనే తవ్వాలని యంత్రాలతో ఎగుమతులు చేయవద్దని నేరుగా డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తవ్వవద్దని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించినప్పటికీ ఇసుక మాఫియా లెక్క చేయడం లేదు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.50 లక్షలు విలువ చేసే ఇసుకను అక్రమంగా తవ్వి అమ్మేస్తున్నారు. పాత పశ్చిమ గోదావరి జిల్లాల్లోని విజ్జేశ్వరం, వాడపల్లి, ఔరంగబాద్ తదితర ర్యాంప్‌లలో యథేచ్ఛగా ఇసుకను డ్రెడ్జింగ్ చేసి ఎగుమతులు చేస్తున్నారు. తీపర్రు ర్యాంప్‌లో రోజుకు వంద లారీలు ఇసుక ఎగుమతి చేస్తున్నారంటే ఏ స్థాయిలో దోపిడి జరుగుతుందో తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని బల్లిపాడు, కుమారదేవం, పెండ్యాల, కడింపాడు ర్యాంప్‌లలోనూ ఇసుకను యథేచ్ఛగా ఎగుమతులు చేస్తున్నారు. తమ అనుకూలురకు మాత్రమే ఐదు యూనిట్ల ఇసుక రూ. 5వేలకు ఎగుమతి చేస్తుంటే బయటి లారీలకు రూ.10 వేలకు ఎగుమతి చేస్తున్నారని పలువురు లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోకల్ లారీలు ప్రాధాన్యత ఇస్తున్న ర్యాంప్‌లు ఒక లారీ అధికారికంగా ఎగుమతి చేస్తే నాలుగులారీలు అక్రమంగా తరలిస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు.

నిత్యం లక్షలాది రూపాయల ఇసుకను అక్రమంగా అమ్మేసుకుంటున్నా ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి కూడా జమ చేయడం లేదని, ఇసుకను థర్డ్ పార్టీ ద్వారా అందిస్తామని అమ్మకాలు పారదర్శకంగా ఉంటాయని పదే పదే రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తమ అనుయాయులకే ఇసుక అమ్మకాలకే గుత్తాధిపత్యం ఇస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొట్టడంపై సర్వత్రం విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఆయా ర్యాంప్‌ల పరిధిలోని పంచాయతీలకు ఇసుక సీనరేజ్‌లలో వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఇసుకను ఎగమతి చేసి భారీ లోడింగ్‌తో రవాణా జరిగే రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లాలో కేవలం ఒకరిద్దరి దందాతో అమ్మకాలు కొనసాగుతుండగా స్థానిక అభివృద్ధి కానరావడం లేదు. ఇసుక ర్యాంప్‌ల ప్రాంతాల్లో రహదారులు పాడై అధిక లోడుతో వెలుతున్న లారీలు కారణంగా కల్వర్టులు కుంగిపోతున్నప్పటికి పట్టించుకోకుండా అక్రమాన్ని పోత్సహిస్తున్న వివిధ శాఖలుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ ఎగుమతులు జరుగుతున్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చెడు వినకు.. చెడు కనకు.. చెడు చూడకు.. అన్న చందాన ఓ వైపు మైనింగ్ అధికారులు. మరో వైపు పోలీసు, రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక తాడేపల్లి పెద్దల ఆదేశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. నిబద్ధతతో వ్యవహరించే అధికారులు సైతం అక్రమాలను చూసి చూడనట్లు వదలేయాల్సి వస్తుందని ఓ రెవిన్యూ అధికారం అనడం గమనార్హం. రెండు, మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అందిన కాడికి దండుకోవడానికి ఇసుక మాఫీయా రెచ్చిపోతుందని పరిశీలకులు చెబుతున్నారు.

ముగిసిన సంక్రాంతి యువజనోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

ఆకివీడు, జనవరి 17: సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతలు విస్మరించడం వలనే యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని సీఐ సత్యనారాయణ, డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ అన్నారు. సంక్రాంతి 41వ యువజనోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చెడుగుడు, జిల్లాల స్థాయి వాలీబాల్ క్రీడాకారులకు ప్రముఖులు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. వ్యవప్రయాసాలకోర్చి 41 ఏళ్లుగా ప్రజలను చైతన్యపరుస్తున్న డీవైఎఫ్ఐ శ్రేణుల కృషి ఆమోఘమన్నారు. సురేష్, గంధం ఉమా, తోట వాసు, అంబటి రమేష్ ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న గన్ని

చంద్రబాబు సభా ఏర్పాట్ల పరిశీలన

భీమడోలు, జనవరి 17 : ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలులో ఈనెల 29న 'రా కదలిరా' బహిరంగ సభ నిర్వహణ నేపథ్యంలో బుధవారం సభా ప్రాంగణాన్ని, పార్కింగ్, హెలీప్యాడ్ స్థలాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి జోన్ -2 సమన్వయ కర్త మండలపు రవి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, పర్వతనేని గంగాధర్ పరిశీలించారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో గన్ని మాట్లాడుతూ చంద్రబాబుపై 17ఏ పై సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై ఇద్దరు జడ్జిలు ఇచ్చిన భిన్నమైన తీర్పులో ఒక జడ్జి తీర్పును ఆసరాగా చేసుకుని వైసీపీ సైకోలు ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు. శిరిబత్తిన కొండబాబు, పట్నాల వెంకటేశ్, దోసనపూడి పుల్లయ్య నాయుడు, అప్పారావు, యడ్లపల్లి శ్రీరామకృష్ణ, జ్ఞాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేల్పూరు అల్లుడికి 85 రకాలతో విందు భోజనం



విస్తరిలో 85 రకాల వంటకాలు

తణుకు, జనవరి 17: గోదావరి జిల్లాలు మర్యాదకు మారుపేరు. సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్లకు రకరకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేయడం అనవాయిగా వస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని వేల్పూరుకు చెందిన చిప్పాడ రంగారావు కుమార్తె దుర్గాభవాని(దేవి)ని నరసాపురం మండలం తూర్పుతాళ్లకు చెందిన అంబటి అప్పల నారాయణ కుమారుడు ఉదయ్ కుమార్‌కు ఇచ్చి ఇటీవల వివాహం జరిపించారు. మొదటి సంక్రాంతికి అత్తవారింటికి వేల్పూరు వచ్చిన సందర్భంగా అల్లుడికి గుర్తుండిపోయేలా సకల మర్యాదలతో 85 రకాలతో విందు ఏర్పాటు చేశారు.

ప్లస్ టూ ఫ్లాప్!

- మహిళా జూనియర్ కళాశాలల నిర్వహణలో ప్రభుత్వం విఫలం
- అధ్యాపకుల కొరత.. అందుబాటులేని పాఠ్యపుస్తకాలు
- పరీక్షల సమయం ఆసన్నం.. అయోమయంలో విద్యార్థినులు

కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యనందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ప్లస్ టూ కళాశాలల్లో సౌకర్యాల లేమి కనిపించడం లేదు. అధ్యాపకులు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకుండా విద్యనెలా అభ్యసిస్తారోనన్న ఆలోచన ఇటు అధికారుల్లోను, ప్రభుత్వానికి లేకపోవడం విద్యార్థినులకు శాపంగా మారింది. కొన్ని కళాశాలల్లో జీరో ఎడ్మిషన్స్ ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. సమస్యలు చుట్టుముట్టినా మొదటి ఏడాది బతుకుజీవుడా అంటూ నెట్టుకొచ్చిన విద్యార్థినులు ద్వితీయ సంవత్సరంలో తమ భవిష్యత్ ఏమిటా అని దిగాలు పడుతున్నారు. మరో రెండు నెలల్లో పరీక్షలు సమీపిస్తుండడంతో ఉత్తీర్ణత సాధించేదెలా అని కొట్టుమిట్టాడుతున్నారు.

భీమవరం రూరల్, జనవరి 17 : ప్రభుత్వ ప్లస్ టూ కళాశాలలు (మహిళా జూనియర్ కళాశాలలు) సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన 2022-23 విద్యా సంవత్సరంలోనే ప్లస్ టూ కళాశాలల్లో అధ్యాపక సిబ్బంది సక్రమంగా లేక తడబడితే.. 2023-24లో ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు అసలు పుస్తకాలే అందించలేనిస్థితికి విద్యాశాఖ చేరింది. బోధన మెటీరియల్ దాతల దాతృత్వంపై ఆధారపడగా పాఠ్య పుస్తకాలు లేకుండానే పరీక్షలు రాయాల్సిన దుస్థితి విద్యార్థినులకు ప్రభుత్వం కల్పించినట్టయింది. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థినులు.. ప్రథమ సంవత్సరంలో సబ్జెక్ట్‌లు బోధించే అధ్యాపకులు లేక ఉత్తీర్ణతలో చాలా మంది వెనుకబడాల్సి వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో పుస్తకాలు లేని చదువుగా మారింది. దీంతో జిల్లాలోని 16 ప్లస్ టూ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 164 మంది విద్యార్థినుల భవిష్యత్ అయోమయంగా మారడం విమర్శలకు తావిస్తోంది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం బాగా పడిపోయింది. గడిచిన రెండేళ్లలో 50 శాతంలోపే ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 16 ప్లస్ టూ మహిళా కళాశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాల నుంచి ఐదు వేలకు పైగా విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించి బయటకు రాగా, కేవలం ప్లస్‌టూ కళాశాలలో గత ఏడాది చేరింది 164 మంది విద్యార్థినులే. ఈ ఏడాది ప్రచారం పెంచి వైసీపీ నాయకులతో విద్యార్థినులను చేర్పించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా 167 మంది మాత్రమే చేరారు. అంటే దాదాపు నాలుగువేల ఎనిమిది వందల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ప్రైవేటు కళాశాలల వైపు చూశారు.



రెండు కళాశాలల్లో జీరో..

ఇరగవరం, యలమంచిలి ప్లస్ టూ కళాశాలల్లో ఒక్క విద్యార్థిని కూడా చేరలేదు. పెంటపాడు కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ఒక విద్యార్థిని చేరితే 2023-24లో నలుగురే చేరారు. పెనుమంట్ర కళాశాలలో గత ఏడాది ఇద్దరు, ఈ ఏడాది ఇద్దరు విద్యార్థినులే. ఇలా క్లాసుకు ఇద్దరు విద్యార్థినులకు బోధన చేసేది ఐదుగురు అధ్యాపకులన్న విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. అట్టహాసంగా ప్రభుత్వం ప్లస్‌టూ కళాశాలలు ఏర్పాటు చేసినా అందుకు తగిన సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడింది. 2022-23లో బోధన సిబ్బంది లేకపోవడం, పుస్తకాలు విద్యా సంవత్సరం సగంలో అందించడంతో విద్యార్థినులు పలు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆ ఏడాది అందరికీ పాఠ్యపుస్తకాలు అందించలేదు. ప్లస్ టూ నిర్వహణలో ప్రభుత్వం ఫ్లాప్ కావడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గొంతేరు డ్రెయిన్ తవ్వకాల అడ్డగింత

తమ భూములకు పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



తవ్వకం పనులు అడ్డుకుంటున్న రైతులు

మొగల్తూరు, జనవరి 17: గొంతేరు డ్రెయిన్ తవ్వకాలను బుధవారం రైతులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మొగల్తూరు పంచాయతీ పరిధిలోని గరువుపల్లవపాలెంకు చెందిన పలువురు పేద మత్స్యకారులకు గొంతేరు డ్రెయిన్ ఆవల భాగమైన ముత్యాలపల్లి రెవెన్యూ పరిధిలో డ్రెయిన్‌ను అనుకుని భూములున్నాయి. డ్రెయిన్ తవ్వకాలకు సంబంధించి ముత్యాపల్లి రెవెన్యూ పరిధిలో 2013లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సుమారు 45 ఎకరాలు భూ సేకరణ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.12.50 లక్షల పరిహారం అందించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సుమారు 15 ఎకరాలకు సంబంధించి 24 మంది రైతులకు నేటి వరకూ నష్ట పరిహారం చెల్లించలేదు. సుమారు మూడు సంవత్సరాల క్రితం డ్రెయిన్ తవ్వకాలు ప్రభుత్వ పరిహారం చెల్లించిన భూముల్లో మాత్రమే పూర్తి చేసి, మిగతా భూములను తవ్వకుండా వదిలేశారు. 15 ఎకరాలకు చెందిన రైతులు నష్టపరిహారం కోసం కలెక్టర్, సబ్ కలెక్టర్, డ్రెయినేజీ అధికారుల చుట్టూ తిరిగినా పరిహారం అందలేదు.

ఇదిలా ఉండగా, నష్టపరిహారం అందని భూముల్లో డ్రెయిన్ తవ్వకాలు జరుపుతుండడంతో బుధవారం రైతులు అడ్డుకున్నారు. రైతులు మోకా శ్రీనివాస్, వెంకట్రాజు, అద్దంకి మల్లికార్జునరావు, కొల్లాటి బాబూరావు, బర్రి వీరాస్వామి, మామిడిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, సుమారు పది సంవత్సరాల నుంచి నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని అన్నారు. డబ్బులిచ్చిన భూముల్లో మాత్రమే తవ్వకాలు చేపట్టిన గుత్తేదారులు అధికారుల అండతో తమ భూములు తవ్వుతుండటంతో తాము అడ్డుకున్నామన్నారు. తమకు పరిహారం చెల్లించకుండా గొంతేరు డ్రెయిన్ తవ్వకాలు చేపడితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అభ్యంతరాలకు పూర్తిస్థాయి పరిష్కారమేదీ?

- 22న తుది ఓటర్ల జాబితా విడుదల
- జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం ఓటర్లు 16,24,413
- మార్పులపై దరఖాస్తులు 3,16,259, పరిష్కారమైనవి 2,96,833

ఏలూరు సిటీ, జనవరి 17 : ఓటర్ల తుది జాబితా ఈనెల 22న విడుదల కాబోతోంది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలు ఘోషిస్తున్నాయి. వారి అభ్యంతరాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిగిందా.. లేదా? అన్న విషయం సందేహాస్పదంగా మారింది. ఇప్పటికే ప్రతిపక్ష టీడీపీ ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ సమస్యలపై పలు అభ్యంతరాలపై ఫిర్యాదు చేసింది. గత అక్టోబరులోనే ఓటర్ల జాబితా అవకతవకలపై ఫిర్యాదు చేసినా అవి పరిష్కారం కాలేదని, ఇప్పుడైనా పరిష్కారమ య్యాయా.. లేదా అన్న విషయం తెలియడం లేదని టీడీపీ చెబుతోంది. పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించే విషయంలో ఆ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఫాం-6, ఫాం-7, ఫాం-8లపై పలు అభ్యంతరాలను గతంలో వ్యక్తం చేస్తూ టీడీపీ ఫిర్యాదు చేసింది. ఇప్పటికీ ఆ అభ్యంతరాలపై స్పష్టత లేదని ఆ పార్టీ శ్రేణులు చెబుతుండగా జిల్లా యంత్రాంగం పారదర్శకంగానే ఓటర్ల జాబితా రూపకల్పన జరుగుతోందని చెబుతోంది.

ప్రతి విషయం రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి: కలెక్టర్

జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకొస్తున్నట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 16,24,413 మంది ఓటర్లుగా నమోదైనట్టు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఈనెల 16 వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 3,16,259 దరఖాస్తులు స్వీకరించగా 2,96,833 పరిష్కరించామని, ఇంకా ఫాం-7 కింద 910, ఫాం-7 కింద 1303, ఫాం-8 కింద 1912 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈనెల 22న ఓటరు తుది జాబితా ప్రకటిస్తారన్నారు. ఖచ్చితమైన, దోషరహిత ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చామ న్నారు. సిర్రా భరత్ (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఆర్.రామ్మోహనరావు (కాంగ్రెస్), పాలి ప్రసాద్ (టీడీపీ), కలవకొల్లు సాంబ (వైసీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర తదితరులు పాల్గొన్నారు.



యోగివేమన చిత్రపటానికి పూజలు

ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం.. నేడు యోగివేమన జయంతి

అత్తిలి, జనవరి 17: ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం యోగివేమన 99వ జయంతిని గురువారం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామంలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. దేశ విదేశాలకు వెళ్లిన వారు వేమన జయంతికి తప్పకుండా స్వగ్రామం వస్తారు. మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. మానవ జీవితానికి సంబంధించి నిత్యసత్యాలను తమ దైన శైలిలో పెద్దతెలుగు పదాలతో వర్ణించి యోగివేమన చిరస్థాయిగా నిలిచారు. వేమన పద్యాలు వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆరవల్లి గ్రామ ప్రజలకు వేమన ఆరాధ్యదైవం అయ్యారు. 1926 ముందు గ్రామంలో ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించేవి. అలాంటి స్థితిలో గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ రెడ్డి దాసు 1926 జనవరి 18న గ్రామంలో తాటాకు పందిళ్లు వేసి వేమన చిత్రపటానికి పూజలు చేయడం ప్రారంభించారు. దీంతో అగ్ని ప్రమాదాలు తగ్గిపోయాయి. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 18న ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

శునకాలకు విస్తరాకుల్లో భోజనం..

ప్రతీ ఏటా గ్రామ శునకాలకు విస్తరాకుల్లో ఆహారం వండి పెట్టడం విశేషం. గ్రామాన్ని రక్షించే శునకాలకు భోజనాలు వడ్డిస్తామని యోగివేమన ఉత్సవ కమిటీ ఛైర్మన్ అమ్మిరెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

కిడ్నీ బాధితుడి ఆత్మహత్య

మొగల్తూరు, జనవరి 17: కిడ్నీ సమస్యతో బాధపడుతూ తప్పిపోయిన ఓ వ్యక్తి పేరుపాలెంతీరంలో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలివి. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంకు చెందిన పెద్దప్రోలు వెంకటేశ్వరరావు (52) కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆచూకి లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పేరుపాలెంతీరంలో కొబ్బరి తోటల్లో క్రిమిసంహారక మందు తాగి మృతి చెందిన వ్యక్తిని స్థానికులు బుధవారం గుర్తించారు. మొగల్తూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వెంకటేశ్వరరావుదిగా బంధువులు గుర్తించారు. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

- యువకుడి మృతి.. మరొకరికి గాయాలు

ఏలూరు క్రైం, జనవరి 17 : స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు గాయపడిన ఘటన ఇది. ఏలూరు గానుగులపేటకు చెందిన పర్వతం రాకేష్‌కుమార్ (17) అతడి స్నేహితుడు జగన్మోహన్‌రావు కలిసి ఈనెల 16వతేదీ సాయంత్రం స్కూటర్‌పై సోమవరప్పాడు వెళ్లారు. అర్ధరాత్రి తిరిగి ఏలూరు వస్తుండగా ఏలూరు-జంగారెడ్డిగూడెంరోడ్డులోని తంగెళ్ళ మూడి వద్ద ఓ కారు ఎదురుగా వచ్చి స్కూటర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాకేష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ ఎం. ప్రభాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ శుభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులుకు అప్పగించారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఏలూరు క్రైం, జనవరి 17 : వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై బుధవారం పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసి రూ.26 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు శివగోపాలపురంలో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.20,900 స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం మాధవాపురంలో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి సిబ్బందితో దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. రూ.5,200 స్వాధీనం చేసుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

- ఐదు కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల అపహరణ

ఏలూరు క్రైం, జనవరి 17 : సంక్రాంతి పండుగకు ఊరెళితే తాళాలు పగుల గొట్టి ఇంట్లో ఉన్నదంతా దోచుకుపోయిన ఘటన ఇది. వివరాలివి. ఏలూరు కట్టాసుబ్బారావుతోటలో నివాసం ఉంటున్న కె.ఈశ్వర్‌కుమార్ తన కుటుంబం తో ఈ నెల 13న విశాఖపట్నం వెళ్లారు. తిరిగి బుధవారం రాగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉంచిన ఐదుకాసుల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమయం దాటి కోడిపందేలు ఆడించారని..

అధికార పార్టీ వైరివర్గాల మధ్య తగాదా?

ఉంగుటూరు, జనవరి 17: మండలంలో పోలీసుల అత్యుత్సాహంతో అధికార పార్టీకి చెందిన కోడి పందేల నిర్వాహకుల మధ్య జరిగిన వివాదం ప్రతిష్ఠ భంగానికి దారి తీసింది. వివరాలివి. నారాయణపురంలో కోడిపందేల బరులు మంగళవారం సాయంత్రానికి ముగించామని నిడమర్రు సీఐతో పాటు నిడమర్రు, చేబ్రోలు ఎస్ఐలు, సిబ్బంది హడావుడి చేశారు. ఒక వర్గానికి చెందిన శిబిరాలను తొలగించి పలుకుబడి ఉపయోగించిన వారి శిబిరంలో అర్ధరాత్రి వరకు కోడిపందేలు ఆడించడంతో ఒకే పార్టీకి చెందిన వైరి వర్గాల మధ్య తగాదాకు దారితీయడంతో బుధవారం వైసీపీ నాయకులు కొందరు వారితో వేర్వేరుగా చర్చలు జరిపి శాంతపరిచామని చెప్పుకుంటున్నారు. ఏదేమైనా ఎన్నికల సమయంలో పందేల తగాదాను కొందరు నేతలు తమకు అవమానంగా భావిస్తున్నారు.

మహిళా క్రికెట్ పోటీలకు గోపన్నపాలెం విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దెందులూరు, జనవరి 17 :అంతర్ కళాశాలల మహిళా క్రికెట్ పోటీలకు గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థినులు నలుగురు ఎంపికయ్యారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ (రాజమహేంద్రవరం) మహిళా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు బుధవారం గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాలలో జరిగాయి. వర్సిటీ పరిధిలోని విద్యార్థినుల్లో అత్యంత ప్రతిభ చూపిన 16 మందిని ఎంపిక చేయగా వీరిలో నలుగురు గోపన్నపాలెం విద్యార్థినులు ఉన్నారు. ఈ నెలాఖరులో తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే అంతర్ కళాశాలల మహిళా క్రికెట్ పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున ఆడతారని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ తెలిపారు. ఈ మేరకు జట్టు సభ్యులను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.సాయిగణేశ్, టి.భవాని, పతంజలి అభినందించారు.



పోటీలో తలపడుతున్న ఆంధ్రా-యూపీ జట్లు

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

- జాతీయస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అంబరీష్, కొత్తపల్లి

నరసాపురం టౌన్, జనవరి 17: గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తే ఎంతో మంది ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆర్డీవో అంబరీష్ అన్నారు. పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో బుధవారం రాత్రి గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి మహిళలు, పురుషుల ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుతో కలిసి ప్రారంభించారు. కొత్తపల్లి మాట్లాడుతూ కబడ్డీ వంటి గ్రామీణా క్రీడల్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 30 ఏళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్ మాట్లాడుతూ పండుగ సమయాల్లో యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా ఉండేందుకు ప్రారంభించిన ఈ పోటీలు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయన్నారు. తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి శాంతి కపోతాలను ఎగురవేశారు. పురుషుల విభాగంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆంధ్రా, యూపీలు తలపడ్డాయి. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, నెక్కంటి సుబ్బారావు, వీసీ కొత్తపల్లి నాని, దొండపాటి స్వామి, వైఎస్ బాబులు, పి.సత్యనారాయణ, జి.మురళీ, వన్నెంరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

21న ఫైనల్స్..ప్రైజ్‌మనీ రూ. 5 లక్షలు

నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో 18 రాష్ట్రాల జట్లు తలపడనున్నాయి. ఈనెల 21న ఫైనల్స్ జరగనున్నాయి. విజేతలకు రూ.5 లక్షలు ప్రైజ్ మనీగా అందించనున్నారు. మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ. లక్ష, ద్వితీయ రూ.75 వేలు, తృతీయ రూ.50 వేలు, నాల్గోస్థానం సాధించిన జట్టుకు రూ. 25 వేలు ఇవ్వనున్నారు. షీల్డ్ అందించనున్నారు.

పూలసాగు పరిశోధనల ఛైర్మన్‌గా జానకీరామ్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 17: జాతీయ స్థాయిలో పూల సాగుపై జరుగుతున్న వివిధపరిశోధనల సలహా మండలి (ఆర్‌పీసీ) ఛైర్మన్‌గా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్‌ను భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి బుధవారం నియమించింది. మహారాష్ట్రలోని పూణే కేంద్రంగా పూలసాగు సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో పూలసాగుపై జరుగుతున్న అన్ని పరిశోధనలకు ఆయన నేతృత్వం వహిస్తారారు. 2027 వరకు జానకిరామ్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు ఎల్. నారంనాయుడు ఆయనను అభినందించారు.

కైకరం విద్యార్థినికి ప్రధాని మోదీ ప్రశంస



పద్మజాహ్నవి

ఉంగుటూరు, జనవరి 17: నాసిక్‌లో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ విశ్వవిద్యాలయంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏలూరు జిల్లా కైకరం గ్రామానికి చెందిన కూన పద్మజాహ్నవిని ప్రధాని మోదీ ప్రశంసించారు. నెహ్రూ యువకేంద్రం ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎనిమిది మందికి ఆహ్వానం రాగా ఏలూరు జిల్లా నుంచి పద్మ జాహ్నవి ఒక్కరికే పాల్గొనే అవకాశం దక్కింది. మోదీ ప్రారంభించిన సదస్సులో వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపే విధంగా వికసిత్ భారత్‌పై తన అభిప్రాయాలను తెలపడంతో పాటు పర్వతా రోహణలో ఏ-గ్రేడ్ సాధించడంతో మోదీ ప్రశంసించారు. తనకు సహకరించిన వైస్ చాన్సలర్ టి.జానకిరామ్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా మేనేజర్ డి.కిషోర్‌కు జాహ్నవి ధన్యవాదాలు తెలిపారు.

గణతంత్ర వేడుకలను విజయవంతం చేయండి

ఏలూరు టూటౌన్, జనవరి 17 : గణతంత్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఆర్డీవో కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. బీఎస్పీ శ్రీనివాస్‌లు, ఆర్డీవో ఖాజావలి, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

మరో మూడు రోజులు సంక్రాంతి సెలవులు పొడిగింపు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 17 : పాఠశాలలకు సంక్రాంతి సెలవులను మరో మూడురోజులు పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 22న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని డీఈవో పి.శ్యాంసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెలవుల పొడిగింపు ప్రైవేటు పాఠశాలలకు కూడా వర్తిస్తుందని డీఈవో స్పష్టం చేశారు. ఇదిలాఉండగా సంక్రాంతి సెలవులు పొడిగించిన రోజులకు ప్రత్యామ్నాయంగా ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసేలోగా ఇతర సెలవు రోజుల్లో పాఠశాలలు పనిచేయాల్సి ఉంటుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనడం పట్ల డీటీఎఫ్ జిల్లా నేత ఆదినారాయణ అభ్యంతరం తెలిపారు. రెండో శనివారం, ఆదివారం సెలవురోజుల్లో పాఠశాలలకు విద్యారులు రారన్న విషయం అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సంతకాలు చేస్తున్న అఖిలపక్ష నేతలు

ఏలూరు టూటౌన్, జనవరి 17 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. యూనియన్ అధ్యక్షురాలు రజిని మాట్లాడుతూ 37 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చామన్నారు. సమస్యలు పరిష్కరమయ్యే వరకు సమ్మె ఆగదన్నారు. గురువారం నుంచి నిరవధిక దీక్ష ప్రారంభించి ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. దుర్గాభవాని, స్వప్న, రజని, ఆరుణ, రామలక్ష్మి, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

అఖిలపక్షం సంతకాల సేకరణ

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష పార్టీలు సంతకాల సేకరణ చేపట్టాయి. ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, సీపీఎం నేత కిషోర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత బద్దా వెంకట్రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు, జనసేన నేత కాశీ నరేష్ పాల్గొన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం తగదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీపీఐ నేత బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నేత కృష్ణమాచార్యులు, ఉప్పులూరి హేమశంకర్ డిమాండ్ చేశారు.



ప్రాకార మహోత్సవం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 17: ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. మహా పూర్ణాహుతి, ప్రాకార మహోత్సవం నిర్వహించారు. తొలుత శ్రీవారు, అమ్మవార్లకు అభిషేకం అనంతరం విశేష పూజలు చేశారు. గోవిందనామ సంకీర్తనలు ఆలపించారు. భక్తులు సామూహికంగా భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహించారు. శ్రీవారి నిత్య కల్యాణ మహోత్సవం చేశారు. శ్రీవారికి ప్రత్యేక ఆరాధన, వేద పఠనం, వేద ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీవారికి పవళింపు సేవా కార్యక్రమాన్ని, దంపత్ తాంబూల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు కోసూరి సత్యనారాయణాచార్యులు, వేద పండితులు యనమంద్ర వేంకట రవిప్రకాష్ శర్మ అవధానులు భక్తులతో మహాపూర్ణాహుతి, విశేష పూజలు జరిపించారు. ధర్మకర్తలు కిలారపు శ్రీనివాసరావు, చోడే శివసాయికృష్ణ, అట్టాడ రామకృష్ణ, కూరాళ్ళ రమాదేవి, తిప్పాని మణి, కత్తిరి ఈశ్వరి, కొండల అరుణకుమారి, గోకనబోయిన నాగలక్ష్మి భక్తులకు సేవలు అందించారు.



లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 17: సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం గరికతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చారు. దక్షిణపువీధి, పవరుపేట, ఆర్ఆర్.పేట, అశోక్‌నగర్, పత్తేబాద, బావిశెట్టివారి పేట, సత్యనారాయణపేట, తదితర ప్రాంతాల్లో వినాయకుడి ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు. ఆలయాల వద్ద గణనాధుని నామస్మరణతో మార్మోగింది.

నూకాలమ్మ అమ్మవారికి 58 కలశాలు బహూకరణ



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

ఏలూరు టూటౌన్, జనవరి 17: కొత్తపేట నూకాలమ్మ ఆలయానికి విజయవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.లలితకుమారి, దుర్గా శ్రీనివాస్ దంపతులు 58 కలశాలు బహుకరించారు. ఆలయ అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో కోలా భాస్కరరావు, వెల్లంకి రాజు, రామకృష్ణ, గొంతిన ఝాన్సీ విజయ, మాధురి, లక్ష్మి, మురళి, నక్కా నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



వార్షిక క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

ఎన్‌సీసీ కేడెట్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 17: జాతి నిర్మాణంలో ఎన్‌సీసీ కేడెట్లు బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని 19 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఉమ్మడి జిల్లా కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ పిలుపునిచ్చారు. కేడెట్స్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-2లో భాగంగా పినకడిమిలో అగ్నిప్రమాదాల నియంత్రణ, నివారణపై కేడెట్లకు లీడింగ్ ఫైర్‌మన్ కె.అప్పారావు, కె.వీర్రాజు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సీవో సౌరబ్ ముఖర్జీ మాట్లాడుతూ వార్షిక శిక్షణలో వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్, సాయుధ దళాల సర్వీసుల సమాచారం, తదితర అంశాలపై తర్ఫీదునిస్తామన్నారు. సామాజిక సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫైర్‌మన్ అప్పారావు, వీర్రాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడే మార్గాలను, వంటగ్యాస్ ప్రమాదాలను నివారించే జాగ్రత్త చర్యలు ప్రదర్శించారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్, సుబేదార్ ఆది నారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్లు మౌనిక, రమ, శేఖర్ పాల్గొన్నారు.

20న ఎమ్మార్పీఎస్ చలో కడప విజయవంతం చేయండి



చలో కడప కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం, జనవరి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సమస్యను పరిష్కరించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చలో కడప కరపత్రాలను సీతారాం బుధవారం ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి లాగు ప్రకాష్ మాట్లాడుతూ 20న కడపలో నిర్వహించనున్న మాదిగల రాజకీయ సమన్వయ మహాసభకు వేలాదిగా తరలిరావాలన్నారు. కడిమి రాజేష్ కుమార్, మద్దిపాటి వెంకటేష్, జొన్నకూటి శ్రీనివాసరావు, జొన్నకూటి శ్రీనివాసరావు, బొబ్బర ఎలీషా, కలపాల శ్రీనివాసరావు, వులపాకుల దుర్గారావు, తానిగడప వీర్రాజు, యలమర్తి రాటాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇండోర్ స్టేడియంలో బైక్ ర్యాలీ

ఏలూరు టూటౌన్, జనవరి 17: విజయవాడలో అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా ఏలూరు ఇండోర్ స్టేడియం నుంచి ఏఎస్ఆర్ స్టేడియం వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం మానవహారం కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ బుధవారం తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురువారం 9గంటలకు ర్యాలీ మొదలవుతుందన్నారు. అనంతరం ఏఎస్ఆర్ స్టేడియంలో మానవహారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



భీమడోలులో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు



చింతలపూడి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రదర్శన



కొయ్యలగూడెంలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు



పెదపాడులో అంగన్వాడీల ర్యాలీ

ఆగని సమ్మె

అంగన్వాడీల నిరసన ప్రదర్శన, ర్యాలీ



బుట్టాయగూడెం సీడీపీవోకు సమాధానం ఇస్తున్న అంగన్వాడీలు

భీమడోలు, జనవరి 17: అంగన్వాడీల సమ్మె నిరాటంకంగా కొనసాగుతోంది. సమస్యల పరిష్కారం కోరుతూ 37వ రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినా సమ్మె ఆపకుండా అంగన్వాడీలు వ్యక్తిగతంగా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జిల్లాలో బుధవారం ర్యాలీ, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు భీమడోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో కార్యాలయానికి చేరుకున్న అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10 నుంచి 12 వరకూ షోకాజ్ నోటీస్‌లు ఇచ్చిన నేపథ్యంలో వ్యక్తిగతంగా రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వానికి ముందుగా నోటీసు ఇచ్చి సమ్మె చేపట్టామన్నారు. అంగన్వాడీలు అత్యవసర సేవలుగా ప్రకటిస్తూ కొత్తగా జీవో తెచ్చి ఎస్మా చట్టం ప్రయోగిస్తామనడం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ పట్టు వదలని విక్రమార్కుడిలా మహిళలు పోరాడుతున్నారని, ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే చలో విజయవాడ నిర్వహిస్తామ న్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు, గుత్తికొండ వెంకట కృష్ణారావు, స్వర్ణకుమారి, చల్లా మణి, రాజామణి, సుజాత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరవధిక సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరుకోగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో తులసికి షోకాజ్ నోటీసులకు సమాధానాలను అందజేశారు. ఎం.నాగమణి, కేవీ.రమణ, టి.రామకృష్ణ, కొండలరావు మాట్లాడుతూ అంగన్వాడీల ఆందోళనపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అనేక రూపాల్లో ప్రభుత్వం ప్రయత్నించిందని, ఎస్మా చట్టాన్ని ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలిపారు. ఎటువంటి చట్టాలకు, అధికారుల బెదిరింపులకు లొంగేది లేదన్నారు. ఐదేళ్లకు ఒకసారి జీతాలు పెంచుతామని మంత్రుల ప్రకటనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టి.ముత్యాలమ్మ, పుష్ప, రామలక్ష్మి, కృపామణి, ఎస్తేరు, మున్నీ, దుర్గ, పోచమ్మ అంగనవాడీలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: అంగన్వాడీ బస్టాండ్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. షోకాజ్ నోటీసులకు వ్యక్తిగతంగా వివరణ పత్రాలు పీవో స్వర్ణకుమారికి అందజేశారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఎన్ని రోజులైన పోరాటం చేస్తామన్నారు. షోకజ్ పేరుతో బెదిరింపు నోటీసులు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో శివరత్నకుమారి, పీఎల్ఎస్ కుమారి, పద్మజ, నాగదేవి, సుమారు 300మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీల సమ్మె చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతలపూడి ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లి ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ నాయకురాలు బీజీఎస్ కుమారి, వి.ఈశ్వరి, మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● చింతలపూడి: అంగన్‌వాడీలు సమ్మె శిబిరం నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. షోకాజ్ నోటీసులకు సమాధానం చెప్పడం కోసం వచ్చామని ఐసీడీఎస్ పీవోకు వివరించారు. విజయవాడలో జరుగుతున్న అంగన్‌వాడీల నిరాహార దీక్ష జయప్రదం చేయాలని, అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రాజెక్టు జేఏసీ నాయకులు ఎస్.సరోజిని, టి.మాణిక్యం, బీజేఎస్.కుమారి, బి.ఫణి, పద్మ, ఈశ్వరి, మార్తమ్మ, సత్యవతి, అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ అన్నారు. ఆర్థికలేమితో అలమటిస్తున్న అంగన్వాడీలు జీతాలు పెంచమని డిమాండ్ చేస్తున్నా సీఎం జగన్ ఏమాత్రం పట్టించుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడువాటిని విస్మరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.నాగేంద్రరావు, రాయి రమణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జోక్యం చేసుకుని సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.ఫణివర్ధిని, ఎస్.మార్తమ్మ, ఎం.సత్యవతి, బాబి తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వేతనాల పెంపుతో పాటు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పెదపాడులో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

రేపు రాఘవాపురంలో జయహో బీసీ సభ



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తారెడ్డి

చింతలపూడి, జనవరి 17: మండలంలోని రాఘవాపురంలో ఈనెల 19న జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. పలువురు బీసీ నాయకులు, మండల నాయకులు సభ విజయవంతం చేయడానికి కార్యాచరణ రూపొందించారు. నియోజకవర్గంలోని బీసీలందరూ పెద్ద సంఖ్యలో గర్జన సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నుముక అని, తిరిగి ఆ వైభవం నియోజకవర్గంలో చూపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య మిద్దే సత్యనారాయణ, కొప్పెర్ల నాగరాజు, పక్కాల వెంకటేశ్వరరావు, తాటి అప్పారావు, కొమ్మరాజు సత్యనారాయణ, పలువురు ప్రజా నాయకులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకానికి దరఖాస్తులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 17: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఏలూరులో ఏర్పాటైన ప్రాజెక్ట్ యూనిట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిన నియామకాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్టు డీఈవో పి.శ్యాంసుందర్ బుధవారం తెలిపారు. అభ్యర్థి విద్యార్హత, కంప్యూటర్ విద్యార్హత, దరఖాస్తును తెల్లకాగితంపై పూర్తిచేసి ఈ నెల 22న సాయంత్రం 5గంటల్లోగా డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలు కార్యాలయ ఫోన్‌నెంబరు 99896 83388లో తెలుసుకోవచ్చన్నారు.

28న విజయవాడలో ఓట్ ఫర్ ఓపీఎస్ ర్యాలీ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 17: 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభలకు పెద్దసంఖ్యలో సీపీఎస్/జీపీఎస్ ఉద్యోగులను తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దాదాపు రెండేళ్ల క్రితం విజయవాడలో నిర్వహించిన మిలీనియం మార్చ్ తరహాలో ర్యాలీ, బహిరంగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా సీపీఎస్/జీపీఎస్ ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో వున్న విద్యాశాఖ ఉపాధ్యాయులను పెద్దసంఖ్యలో విజయవాడలకు సమీకరించాలని నిర్ణయించారు. యూటీఎఫ్ సహా మిగతా ఉపాధ్యాయ సంఘాల మద్దతు లభించడంతో ప్రభుత్వానికి తమ వ్యతికేకతను తెలియజేయనున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఏలూరు టూటౌన్, జనవరి 17: నవభారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలి వెళ్లాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న ఆవిష్కరణ కార్యక్రమానికి బుధవారం వైసీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాని మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి హక్కుల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు సుధీర్‌బాబు, గుడిదే శ్రీనివాసరావు, మంచెం మైబాబు, నెరుసు చిరంజీవిలు పాల్గొన్నారు.

కోడి పందేల్లో ఘర్షణ

కామవరపుకోట, జనవరి 17: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేల్లో ఘర్షణలు తలెత్తాయి. రావికంపాడులో జరిగిన కోడి పందేల్లో ఒక వ్యక్తి 20 వేలు పందెం కాసి పరారయ్యాడు. దీంతో అతడిని పందెంగాళ్లు వెంటాడి పట్టుకుని బరిలోకి తీసుకువచ్చి అతడి నుంచి డబ్బులు వసూలు చేశారు. దీంతో వివాదం నెలకొంది. కొద్దిసేపటి వరకు వివాదం చెలరేగింది. ఎట్టకేలకు అతని నుంచి పందెంగాళ్ళు డబ్బు వసూలు చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పాలన చేతకాని జగన్‌ను సాగనంపాలి : జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 17: రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసిన పరిపాలన చేతకాని జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాల్సిందేనని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. జనసేన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఏలూరు నగరంలో 3 వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, ఒక్క కుటుంబమైనా గృహప్రవేశం చేసిందా అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలు నగరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఇచ్చారని, దీంతో అక్కడ ఎలా ఉండగలమని పేదలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇళ్ల స్థలాల కొనుగోలులో కూడా అక్రమాలు జరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారని అప్పలనాయుడు అన్నారు. నగిరెడ్డి కాశీ నరేష్, బొత్స మధు, అల్లు సాయిచరణ్, రెడ్డి గౌరీశంకర్, బొండా రామునాయుడు, గుప్త తదితరులు ఉన్నారు.

వీర బ్రహ్మాచారి మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి బృందం

టి.నరసాపురం, జనవరి 17: తిప్పర్తి వీర బ్రహ్మాచారి మృతి బుర్రకథ కళారంగానికి తీరని లోటని ప్రజా నాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు అన్నా రు. బొర్రంపాలెంలో బ్రహ్మాచారి సంస్మరణ సభ సహాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమళ్ళ మధు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బ్రహ్మాచారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీవీఎస్.రాజు, సీనియర్ బుర్ర కథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, ప్రముఖ కవి తిప్పాభట్ల రామకృష్ణ, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, సీనియర్ జానపద కళాకారులు చిలుకూరి సుబ్బయ్యచారి, పౌరాణిక కళాకారులు తోట సత్యనారాయణ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

లింగపాలెం, జనవరి 17: కుప్పాలవారిగూడెం, ములగలంపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రాలకు అందే పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. జలజీవన్‌మిషన్ ద్వారా త్రాగునీరు, ఉచిత గ్యాస్ వంటి అనేక పథకాలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదం, బీజేపీ రాష్ట్రకిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు ఆర్.ఎస్.ఎస్ చక్రధర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వరవరప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి కోటగిరి మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సునీత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

లింగపాలెం, జనవరి 17: మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆశీర్వాదం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులందరూ గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5వరకు గల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు గురువారం, శుక్రవారం రెండురోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



తాడువాయి హైస్కూల్‌లో గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాడువాయి హైస్కూల్‌లో 25 ఏళ్ల తర్వాత..

జంగారెడ్డిగూడెం, జనవరి 17: చిన్ననాటి స్నేహితులంతా 24 ఏళ్ల తర్వాత మళ్లీ కలిశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి హైస్కూల్‌లో 1998-99 పదో తరగతి చదివిన విద్యార్థులంతా బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. పాఠశాలలో నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో కలియదిరిగారు. ఈ సందర్భంగా వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు.



నారాయణపురం హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నారాయణపురం హైస్కూలులో 23 ఏళ్ల తర్వాత..

ఉంగుటూరు, జనవరి 17: హైస్కూలులో పదో తరగతి చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు రూ.3లక్షలతో సైకిల్ షెడ్డు నిర్మించారు. 2001-2002 పదో తరగతి వారంతా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబాల యోగ క్షేమాలు తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు.

పాఠశాలకు గోడ గడియారం బహూకరణ

బుట్టాయగూడెం, జనవరి 17: కోయ అంకంపాలెం ఎంపీపీ పాఠశాలకు పూర్వ విద్యార్థి పూనెం బుచ్చిరాజు గోడ గడియారాన్ని బుధవారం బహూకరించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హెచ్ఎం సూరిబాబు, పూనెం పాపారావు, తెల్లం లక్ష్మణరావు, కె.నూకరాజు, కె.మల్లయ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహం వద్ద నివాళి

భీమడోలు, జనవరి 17: శ్రీకృష్ణ దేవరాయల జయంతి భీమడోలులో శ్రీకృష్ణదేవరాయ కాపు యువత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. భీమడోలు సంతమార్కెట్ సమీపంలోని కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. పసుపులేటి సత్యనారాయణ, యర్రంశెట్టి ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


క్రికెట్ విజేత వెల్లమిల్లి -2 జట్టు

ఉంగుటూరు, జనవరి 17: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రికెట్ ఫైనల్ పోటీలు నారాయణపురం డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం జరిగాయి. టాస్ గెలిచిన కైకరం జట్టు బౌలింగ్ తీసుకుంది. బ్యాటింగ్ చేసిన వెల్లమిల్లి-2 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కైకరం-1 జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 53 పరుగులు చేసింది. వెల్లమిల్లి జట్టులోని భీమడోలు సోమరాజు 51 పరుగులు చేశారు. బౌలింగ్‌లో వెల్లమిల్లి జట్టు సీహెచ్.మణి హ్యాట్రిక్ సాధించారు. దీంతో వెల్లమిల్లి-2 జట్టు 45 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ఎన్టీఆర్ వర్ధంతికి సేవా కార్యక్రమాలు

కామవరపుకోట, జనవరి 17: మండలంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లో పసుపు జెండాలు, తోరణాలతో అలంకరించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. కామవరపుకోట, కొత్తూరు, తాడిచర్ల, గుంటుపల్లి, కళ్ళచెరువు, పోలాసిగూడెం, తడికలపూడి, ఆడమిల్లి, రావికంపాడు, రామన్నపాలెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దెందులూరు ఎంపీడీవోగా శ్రీలత



దెందులూరు, జనవరి17: ఎంపీడీవోగా వెన్న శ్రీలత బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఏబీవీపీ లక్ష్మి పదోన్నతిపై ఏలూరు బదిలీ అయ్యారు. మచిలీపట్నం డ్వామా ఏపీడీ శ్రీలతను నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

పెదపాడు ఎంపీడీవోగా తేజరతన్



పెదపాడు, జనవరి 17 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.తేజరతన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన నిర్మలకుమారి పదోన్నతిపై వెళ్లడంతో, ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. సీఆర్డీఏ (తాడేపల్లి) నుంచి బదిలీపై వచ్చిన తేజరతన్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ఏలూరు కొత్త బస్టాండ్ రిజర్వేషన్‌కౌంటర్ వద్ద రద్దీ



ఏలూరు కొత్త బస్టాండ్‌లో వేచివున్న ప్రయాణికులు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్

వెళ్లొస్తాం..

ఇళ్లకు తిరుగుప్రయాణం

బస్సులు, రైళ్లు ఫుల్

కిటకిటలాడిన బస్టాండ్ రైల్వేస్టేషన్లు

సంక్రాంతి పండుగ ముందు ప్రయాణం.. సంక్రాంతి ముగిసినా ప్రయాణం అప్పుడు బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళుతున్నామని ఉత్సాహం. ఇప్పుడు పాఠశాల, కళాశాల, కొలువులకు వెళ్లాలని కంగారు. పండుగ ముగియడంతో రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బస్టాండ్, రైల్వే స్టేషన్లు రద్దీగా మారిపోయాయి. వెళ్లొస్తా.. జాగ్రత్తగా వెళ్లు.. బై బై.. పలకరింపులతో సందడిగా కనిపించాయి. చిన్న పిల్లలు, లగేజీతో తల్లిదండ్రులు పయనమైతే.. సుదూర ప్రాంత కళాశాలల్లో చదివే విద్యార్థులు భారీ లగేజీతో కంగారుగా పరుగెత్తారు. ఏలూరులో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లతో పాటు నగరంలో వివిధ చోట్ల బస్టాప్‌లు సైతం ప్రయాణికులతో కిటకిటలాడాయి. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / ఏలూరు



పండుగ ముగిసింది.. కళాశాలకు పయనం



బంధువుల ఇంటి నుంచి.. స్వగ్రామానికి పయనం



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు



బై..బై.. మళ్లీ పండుగకు కలుద్దాం



జూదశాలగా.. అంగన్‌వాడీ కేంద్రం!

ముదినేపల్లి, జనవరి 17 : అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు పనికి రాదంటూ ఐసీడీఎస్ అధికారులు మూసేసిన ప్రభుత్వ భవనం ప్రస్తుతం జూదశాలగా మారింది. మండలంలోని పెయ్యేరు కాలనీలోని సీతారామపురం -4వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్ర భవనానికి తాళాలు వేయకుండా వదిలేయటంతో జూదాలకు, కోడి పుంజుల పెంపకానికి కేంద్రంగా మారింది. శ్లాబు అడుగు భాగం నుంచి సిమెంట్ పెచ్చులు విరిగి పడిపోతుండటం, వర్షం వస్తే భవనంలోకి నీళ్లు రావటంతో భవనం ప్రమాదకరంగా మారింది. కాగా, పిల్లలు ప్రమాదాలబారిన పడే అవకాశాలు ఉండడంతో పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్‌శాఖ అధికారుల సూచనలతో కొద్దికాలం క్రితం ఐసీడీఎస్ అధికారులు ఆ భవనాన్ని మూసేసి అద్దె గృహంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు. పాత భవనం వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఖాళీగా ఉండటంతో అసాంఘికశక్తులకు అడ్డాగా మారింది. జూదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



కేంద్రం లోపల పేక, ఆవరణలో కోడిపుంజుల పెంపకం

నైట్‌వాచ్‌మెన్‌ను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

ముసునూరు, జనవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో నైట్‌వాచ్‌మెన్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. బుధవారం చెక్కపల్లిలో నైట్‌వాచ్‌మెన్ యూనియన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు గ్రాట్యూటీ ఇవ్వాలని, ఉద్యోగ విరమణ తరువాత రూ. 10 వేలు పెన్షన్‌తోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చెంగల శివాంజనేయులు, అధ్యక్షుడిగా ముక్కు నాగేశ్వర రావు, కోశాధికారిగా బొమ్మనబోయిన శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. నాయకులు పల్లిపాము భవాని, పి.కృష్ణ, కె.ఏసుబాబు, ఏసేబు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ఫైర్ స్టేషన్ ఏర్పాటయ్యేనా?

- శకటం అందుబాటులో లేక కాలి బూడిదౌతున్న ఇళ్లు
- కట్టుబట్టలతో రోడ్డున పడుతున్న కుటుంబాలు
- వినతులు పట్టించుకోని పాలకులు, అధికారులు

కలిదిండి, జనవరి 17 : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గాని, అజాగ్రత్తవల్లగానీ తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఎక్కడో దూరాన ఉన్న పక్క మండలం నుంచి ఫైరింజన్ వచ్చేలోగా ఇళ్లు కాలి బూడిదవుతుంటాయి. కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డుమీద పడతారు అన్నది జగమెరిగిన సత్యం. వేసవిలో అయితే ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో అత్యవసర సర్వీసుల్లో ఒకటైన అగ్నిమాపక కేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న ఆలోచన పాలకుల్లోగానీ, అధికారుల్లో గాని లేకపోవడం దురదృష్టకరం. ఓట్ల కోసం హామీలిచ్చి ఆనక ముఖం చాటేయడం నైజంగా మారింది. ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక శకటం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

మండల కేంద్రమైన కలిదిండిలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్ర నష్టం జరుగుతోంది. చుట్టూ పక్కల ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కైకలూరు నుంచి శకటం వచ్చేలోగా నష్టం జరిగిపోతుంది. లంక గ్రామాల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. కలిదిండిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాలతోపాటు లంక గ్రామాలకు ఫైర్ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రమాదాలను నివారించటం సులభమౌతుందని ప్రజలు అంటున్నారు. కలిదిండికి సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల లోపులో గ్రామాలు ఉండటంతో అగ్నిప్రమాదం సంభవించిన అరగంటలోపు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసే అవకాశం ఉంటుంది. దీంతో ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా కాపాడవచ్చు. ఫైర్ స్టేషన్ ఆవశ్యకతపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదు. ఎన్నికల సమయంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని రాజకీయ నాయకులు హామీ ఇస్తున్నారని అధికారంలోకి రాగానే హామీని తుంగలోకి తొక్కుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కలిదిండిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కైకలూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు



ముదినేపల్లిలో జనసేన, టీడీపీ నాయకుల సమావేశం

నేడు గుడివాడలో 'రా.. కదలి రా'

చంద్రబాబు సభ సక్సెస్ చేయాలని టీడీపీ-జనసేన నాయకుల పిలుపు

కైకలూరు, జనవరి 17: గుడివాడలో జరిగే టీడీపీ 'రా.. కదలి రా' సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల రావు పిలుపునిచ్చారు. బుధవారం కైకలూరు పార్టీ కార్యా లయంలో టీడీపీ, జనసేన నాయకులతో కలసి విలేకర్లతో మా ట్లాడుతూ గురువారం గుడివాడలో జరిగే రా కదలిరా కార్యక్రమానికి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వస్తారని కైకలూ రు నియోజక వర్గం నుంచి సుమారు 10 వేల మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు సభకు తరలి రావాలన్నారు. అలాగే టీడీపీ కార్యకర్తలతో పాటు జనసేన పార్టీ శ్రేణులు తరలివచ్చి సభను విజయవంతం చేయాల న్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి గుడివాడ బహిరంగ సభకు తరలివస్తారన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయం నుండి కార్లు, బైకులు ర్యాలీగా సమావేశానికి వెళ్లేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నామన్నారు. మండల పార్టీల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బీవీ రావు, తెలుగు మహిళా నాయ కురాలు పోలవరపు లక్ష్మీరాణి, గుజ్జుల రామలక్ష్మి, పార్టీ నాయకులు వేములపల్లి కారుణ్య, ఎస్సీసెల్ నాయకుడు తేరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: గుడివాడలో రా కదలిరా సభకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి పిలుపుని చ్చారు. బుధవారం తన నివాసంలో టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ముదినేపల్లి మండలం నుంచి ప్రతి కార్యకర్త తరలివచ్చే విధంగా నాయకులు కృషి చేయాలని కోరారు. జనసేన మండల అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు పరసా విశ్వేశ్వరరావు, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ తదితరులు హాజరయ్యారు.

కలిదిండి: గుడివాడలో గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు 'రా.. కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలన్నారు.

బైక్ ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు

ముదినేపల్లి: గుడివాడలో గురువారం జరిగే రా కదలిరా సభకు ముది నేపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముదినేపల్లితోపాటు మండలం లోని అల్లూరు, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, కాకరవాడ గ్రామాల నుంచి కూడా టీడీపీ, జనసేన కార్యకర్తలు ర్యాలీగా గుడివాడ వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలానికి సరిహద్దులోనే జరుగుతున్న ఈ సభను విజయ వంతం చేసేందుకు కార్యకర్తలు తరలిరావాలని నాయకులు కోరుతున్నారు. ముదినేపల్లి నుంచి భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ తెలిపారు.

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

గుడివాడలో టీడీపీ సభ జరుగుతున్నందున వాహనాల రాకపోకలపై పోలీ సులు ఆంక్షలు విధించారు. గుడివాడ - ముదినేపల్లి జాతీయ రహదారి సమీ పంలో సభ జరుగుతున్నందున భారీ వాహనాలు, లారీలను ఆ రూటులో అను మతించమని గుడివాడ డీఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్ జం క్షన్, పెదపారుపూడి నుంచి ముదినేపల్లి వైపునకు, ముదినేపల్లి నుంచి గుడివాడ వైపునకు వెళ్లే లారీలు, ఇతర ప్రైవేట్ వాహనాలను గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు అనుమతించమని, ప్రత్యామ్నా య మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎస్పీ కోరారు.



కైకలూరులో అంగన్వాడీల ర్యాలీ



నూజివీడులో షోకాజు నోటీసులకు సమాధానమిస్తున్న అంగన్‌వాడీలు

నినాదాలతో దద్దరిల్లిన కైకలూరు

- అంగన్వాడీల భారీ ర్యాలీ
- ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడి

కైకలూరు, జనవరి 17: అంగన్వాడీలు బుధవారం కైకలూరులో పెద్దయెత్తున ప్రదర్శన నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని అంగన్వాడీలు కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో పాటు ఐసీడీఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. కైకలూరు జాతీయ రహ దారిపై వందలాది మంది ర్యాలీ నిర్వహించడంతో రహదారి కిక్కిరిసి పోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ 37రోజులుగా అంగ న్వాడీలు ధర్నా చేస్తున్నా జగన్ పట్టించుకోకపోవడం ఆయన నియంత పాలన కు నిదర్శనమన్నారు. ఐదేళ్లకోసారి మాత్రమే జీతాలు పెంచుతామని చెప్పే ప్రభుత్వం నిత్యం విద్యుత్ చార్జీలు, పెట్రోలు, డీజిల్, ఆర్టీసీ బస్సు చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు అనేక దఫాలుగా ఎందుకు పెంచిందని ప్రశ్నించారు. ధరలు పెంచి ప్రజల జీవించలేని స్థితికి తీసుకువ చ్చారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ముఖ్యమంత్రి కార్యాలయన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జే గోపి, నాలుగు మండలాల అంగన్వాడీ యూనియన్ నాయకులు చెల్లమ్మ, వాణి, రమాదేవి, అబుదాబేగం, ఉమాదేవి, అరుణకుమారి, రిబ్కా, మణి, పద్మ, ఝాన్సీరాణి, సత్యవతి, పి సుజాత, ఎల్. మీనాకుమారి, విజిత, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం రానిదే ఎలా ఇవ్వం..

షోకాజ్ నోటీసులకు అంగన్వాడీల సమాధానం

నూజివీడు టౌన్: డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలను విధుల్లో చేరాలంటూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసు లకు అంగన్‌వాడీలు మూకుమ్మడి సమాధానం ఇచ్చారు. నూజివీడు సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఆర్. హనుమాన్లు, జి.రాజు మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ ను ఇవ్వటంలో తమ వైఫల్యం లేదని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ డిసెంబరు 8 వరకు సెంటర్లకు రాలేదని అందువల్ల వారి ప్రయోజనాలకు అంగన్‌వాడీ యూనియన్ తలపెట్టిన సమ్మెకు సంబంధం లేదన్నారు. నాలుగేళ్లలో నిత్యా వసర సరుకుల ధరలు భారీగా పెరిగినందున కరువుభత్యం పాయింట్లు లెక్కి స్తే కనీసం రూ.3,630లు చెల్లించాల్సి ఉన్నా వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజంగా ఐసీడీఎస్‌ను అత్యవసర సర్వీస్ అని భావిస్తే జీవో-2లో పేర్కొన్నట్లు ప్రాధాన్యత ప్రకారం అంగన్వాడీలకు జీతాలు ఎందుకు పెంచలేదో చెప్పాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, రాజకుమారి, విజయ, ప్రమీల, రాజ్యలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన జగన్ : కామినేని



మండవల్లి, జనవరి 17: జగన్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని లింగాల, అల్లినగరం, మూడుతాళ్లపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని అధోగతి పాలు చేసిన జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. లింగాలలో రూ. 70 లక్షలతో సిమెంటు రోడ్లు వేస్తే నేటి ప్రభుత్వ హయంలో అవి అధ్వానంగా మారాయని, పోలవరం పనులు ఆగిపోవడంతో నీరందక రైతులు పంట నష్టపోయారని, కరెంటు బిల్లులు మోతతో ఆక్వా రైతులు నష్టాల బాట పట్టారని, రాబోయే కాలంలో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చాపరాల దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు బొమ్మనబోయిన ప్రసాద్, పార్టీ లింగాల నాయకుడు పోలవరపు శ్రీనివాస్, మండవల్లి మండల నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, గనిశెట్టి మోహన్‌కుమార్, చాబత్తిన విజయ్, కూనపురెడ్డి కోటేశ్వరరావు, ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు. కాను కొల్లులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తేజశ్రీ కుటుంబీకులను కామినేని పరామర్శించారు.

కులగణన పారదర్శకంగా చేపట్టాలి

కైకలూరు, జనవరి 17: గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కులగణన పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ బి. మురళీకృష్ణ సూచించారు. బుధవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో కులగణనపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు కులగణన నిర్వహించాల న్నారు. వార్డు వలంటీర్‌తో కులగణన చేసి పూర్తి నివేదికను మండల స్థాయిలో తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇంటి వద్ద అందుబాటులో లేనివారి కోసం వచ్చే నెల 5వ తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని అక్కడ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఉమహేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, ఎంఈఓ డి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కైకలూరు, జనవరి 17: పల్లెవాడ గ్రామానికి చెందిన పీఏసీఎస్ కార్యవర్గ సభ్యుడు దుట్టా శివయ్య ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబీకులను పరామర్శించి రూ.10వేలు అందించినట్లు పీఏసీఎస్ ఛైర్మన్ గంగుల అశోక్ తెలిపారు. పల్లెవాడ పీఏసీఎస్, జిల్లా సహకార కేంద్రబ్యాంకు కైకలూరు సహకారంతో ఆర్థికసాయం అందజేశామన్నారు. దుట్టా నవీన్, సంఘ సభ్యుడు లేళ్ళ ప్రకాశరావు, సీఈవో జి. నాగేశ్వరరావు, ఎస్. జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి ప్రధాన రహదారి పక్కనే పోలీస్ స్టేషన్ వద్ద మురుగు నీటి గుంట



స్టేట్ బ్యాంక్ ఎదురుగా నిల్వ ఉన్న మురుగు



ముదినేపల్లి తూర్పు పాఠశాల రోడ్డులో మురుగునీరు

మురుగుతోనే సహవాసం!

- పారని మురుగుతో ప్రజల పాట్లు
- రహదారిపైనే మురుగు నిల్వలు
- ముదినేపల్లిలో దుస్థితి

ముదినేపల్లి, జనవరి 17 : ముదినేపల్లిలో ముక్కు మూసుకుని తిరగాల్సిందే. గ్రామంలో ప్రధాన రహదార్లపై ఎక్కడ చూసినా మురుగు నీరు, మురుగుతో నిండిన గుంతలు దర్శనమిస్తున్నాయి. గ్రామస్థులు మురుగునీటితోనే సహవాసం చేస్తున్నారు. జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వ్యాపార సంస్థల వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక తూర్పు ప్రాథమిక పాఠశాల రోడ్డులో నిత్యం డ్రైన్ల నుంచి రోడ్డు మీదికి మురుగు నీరు ప్రవహిస్తూంటుంది. ఇళ్లలోని వృథా నీరు పక్కనే ఉన్న చెరువులోకి వెళ్తుంది. దీంతో చెరువు పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులతోపాటు పరిసర ప్రాంత వాసులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని డ్రైన్లన్నీ ఎంతో కాలంగా మురుగునీటితో నిండి ఉన్నాయి. ఇక పోలీస్ స్టేషన్ వద్ద మురుగునీటి ప్రవాహం తగ్గటం లేదు. ఇళ్ల నుంచి వచ్చిన వృథా నీరు పక్కా డ్రైన్లలోనే స్తంభించిపోతున్నది. డ్రైన్లు పలు చోట్ల ఆక్రమణలకు గురికావటంతో మురుగునీరు బయటికి పోయే మార్గం లేకుండాపోయింది. దీంతో గ్రామంలో దోమల బెడద కూడ ఎక్కువయింది. పక్కా డ్రైన్లలో పూడికతీయటం, ఆక్రమణలు తొలగించేందుకు పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ప్రణాళికల తయారీపై శిక్షణ



ముసునూరు, జనవరి 17: పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. బుధవారం ముసు నూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయ తీ సుపరిపాలన, అభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులకు శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంచాయ తీల వద్ద ఉన్న నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేసి, పంచాయతీ తీర్మానం చేసి, మండల కమిటీకి పంపాలని, తదుపరి ఈ-గ్రామ స్వరాజ్ యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. కమిటీ పంపిన తీర్మానంలో పనులకు మాత్రమే నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ యోహాను, సూపరింటెండెంట్ కె.సాయిరామ్ ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లు తొలగించండి



సబ్ కలెక్టర్‌కు జనసేన నాయకుల వినతిపత్రం

నూజివీడు, జనవరి 17: నూజివీడు నియోజకవర్గంలో రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని నూజివీడు జనసేన నాయకుడు ముత్యాల కామేష్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల బ్యానర్ల వివాదంలో ఎమ్మెల్యే కార్యాలయంలో కత్తులతో దాడిచేసుకున్న ఘటనను ఆయన ప్రస్తావిస్తూ రాజకీయ పార్టీ బ్యానర్ల వల్ల నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణం నియోజకవర్గంలో రాజకీయ పార్టీ బ్యానర్లను తొలగించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో దశాబ్దాలుగా నిలిచిపోయాయని ఇండోర్ స్టేడియం నిర్మాణం తక్షణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. నూజివీడు మండల ఉపాధ్యక్షులు యింటూరి చంటి తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో టాస్ వేస్తున్న అధికారులు

ఫైనల్స్‌కు పోలవరం, కోటపాడు జట్లు

చాట్రాయి, జనవరి 17: చాట్రాయి జడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రికెట్ ఫైనల్స్ నిర్వహించారు. పోటీల్లో పలు గ్రామాలకు చెందిన 16 జట్లు పాల్గొనగా, పురుషుల విభాగంలో పోలవరం, మహిళా విభాగంలో కోటపాడు విన్నర్స్‌గా నిలిచారు. పీఈటీలు సతీష్‌కుమార్, ప్రభాకర రావు, విజయ్, వెంకట్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల హక్కుల సాధనకు పోరాటం

ఆగిరిపల్లి, జనవరి 17: ముదిరాజ్‌ల హక్కుల సాధనకు పోరాడతానని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఆగిరిపల్లిలో రాష్ట్ర కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడు తూ రానున్న కాలంలో ముదిరాజ్‌ల హక్కుల సాధనకు యువతకు శిక్షణ తరగతులు నిర్వహించి పోరాట కార్యక్రమం రూపొందించనున్నట్లు తెలిపారు. నాయకులు గునిశెట్టి సత్యనారాయణ, దుప్పల సీతయ్య, బోణం శ్రీనివాస్, బొట్టా విష్ణు, మహిళా సంఘ నాయకురాలు వేమారెడ్డి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

షర్మిల నియామకంపై హర్షం

ముదినేపల్లి, జనవరి 17 : ఏపీసీసీ అధ్యక్షురాలిగా వై.ఎస్.షర్మిల నియామకంపై పీసీసీ సభ్యుడు మంగినేని బాబ్జీ హర్షం వ్యక్తం చేశారు. ఆమె హయాంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. షర్మిల నియామకం పట్ల ముదినేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గోళ్ల రాజ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

చాట్రాయి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైయస్ షర్మిల నియామకం పట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రతికంటి రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్య దర్శి అమిరిశెట్టి వెంకటేశ్వరరావు(చంటి), మండల నాయకుడు రమణ నెహ్రూ హర్షం వ్యక్తం చేశారు. షర్మిల సారధ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని అన్నారు.



ముగ్గుల పోటీలు

కలిదిండి, జనవరి 17 : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, కేవీపీఎస్ నాయకుడు ముంగం సురేష్, మహిళా సంఘం నాయకులు మహాలక్ష్మి, వరలక్ష్మి, రుక్మిణి, డీవైఎఫ్ఐ నాయకులు గడ్డె అనిల్ కుమార్, రామకృష్ణ, పెద్దిరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కలిదిండి, జనవరి 17 : కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో 1996-97కు చెందిన టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వీరంతా కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. నాడు విద్య నేర్పిన గురువులను సత్కరించారు. వెంకటరెడ్డి, ఈశ్వర్, శివకోటి, వెంకన్నబాబు, సోమరాజు, సతీష్, గొల్లయ్య, లక్ష్మీనారాయణ, తులసి, తార, సుజాత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.